# 'వాడు' ఏడుస్తున్నాడు

ఎస్. నూర్ అహ్మద్

**కదలడానికి సిద్ధంగా నిలబడ్డ రైల్లో, రద్దీ లేని కారణంగా ప్యాసింజర్లు నింపాదిగా వున్నారు. పక్కనున్న వారితో మాట్లాడుతూ కొందరు, వీడ్కోలు పలకడానికి వచ్చినవారితో కిటికీల్లో నుంచి పలకరిస్తూ ఇంకొందరు. పుస్తకాల్లో, పత్రికలో చదువుతూ మరికొందరు..ఎవరి లోకంలో వాళ్ళున్నారు. సరిగ్గా అప్పుడే ఆ బోగీలోకి అడుగు పెట్టాడు 'వాడు'. వాడికి పేరు లేదు కాబట్టి 'వాడు' అనే పిలవాలి.**

పిర్రలపై పిగిలిపోయి తూట్లు పడ్డ పొట్టి నిక్కరు తప్ప మరే ఆచ్ఛాదనా లేని వాడి శరీరంపై దట్టంగా పేరుకుపోయిన దుమ్ము, పుట్టుకతో వచ్చిన పసిమి రంగును గోధుమ వర్ణంలోకి మార్చేసింది. ఆకలితో అడుగంటి పోయిన కడుపు, కండరాలు కరిగిపోయి పైకి తేలిన పక్కటెముకలు, బక్కచిక్కిన దేహంపై అక్కడక్కడా మానిపోతున్న గాయాల గుర్తులు, పేగుల్లో పేరుకుపోయిన ఆకలిని దాచే ప్రయత్నం చేయని దయనీయమైన కళ్ళు, ఎండిపోయిన పెదాలు, చిందర వందరగా పెరిగిన జుత్తు వాడి దయనీయ స్థితిని చెబుతున్నాయి.

వాడికి నాలుగేళ్ళు దాటాయో, ఐదేళ్ళు వచ్చాయో చెప్పడం కష్టం. మొత్తం మీద ఎందరికో సుందర స్వప్నం లాంటి బాల్యానికి పట్టిన మురికిలా వున్నాడు.

*** *** ***

బోగీలోకి అడుగు పెడుతూనే కాలక్షేప పత్రికను చదువుకుంటున్న ఒక ప్రయాణీకుడి ఏకాగ్రతను చెదరగొడుతూ,

'అయ్యా......' అని చేయి చాచి నిలబడ్డాడు.

పత్రిక చదువుతున్న వ్యక్తి వాడివైపు తలతిప్పి కూడా చూడకుండా 'చిల్లర లేదు' వెళ్ళమన్నాడు. సరిగ్గా వాడి వయసంతే వున్న పిల్లాడ్ని ఒడిలో పడుకోబెట్టుకుని బుజ్జగిస్తున్న ఒక తల్లి ఎదుట నిలబడి మరోసారి చేయి చాచి;

"అమ్మా...."అన్నాడు వాడు.

"లేదు పోరా...!" అని కసిరికొట్టిందావిడ.

అలాగే ఇంకొంతమందిని అడుగుతూ ముందుకు పోయాడు వాడు. కానీ ఎవరూ దయతల్చలేదు.

"సామాన్లు ఎత్తుకెళ్తాడేమో చూసుకోండి.." అని ఒకరంటే–

"ఇలాంటి వాళ్ళని ప్రోత్సహిస్తే ఎందుకూ పనికిరాని వాళ్ళుగా, దొంగలుగా తయారౌతారండీ.." సాగదీశాడు మరొకాయన.

"వీడికి డబ్బిస్తే దేశానికి ద్రోహం చేయడమే.." అనే లెవెల్లో చిన్నసైజు ఉపన్యాసమే ఇచ్చాడు. దాంతో పెద్దమనసు చేసుకుని పదో పరకో పడేద్దామనుకున్నవారు కూడా మనసు మార్చుకుని మౌనంగా వుండిపోయారు.

మామూలుగా ఒక్కో బోగీలో పది పైసలో, పావలాయో వాడి చేతిలో పడతాయి. నోటంటే ఎలా వుంటుందో కళ్ళతో చూడ్డమే తప్ప చేతితో తాకి ఎరగని వాడికి, ఆ చిన్న చిల్లర నాణేలు అరచేతిలో పడ్డప్పుడు లోకాన్ని జయించినంత ఆనందం కలుగుతుంది. ఆ పూట కడుపు నింపుకోవడానికి ఆధారం దొరికిందనే సంతోషంతో ముఖం విప్పారుతుంది. ఆ అనుభూతి కోసమే వాడు ఎదుటి వాళ్ళ చీదరింపులు, ఛీత్కారాలను పట్టించుకోడు. అయితే ఆ బోగీలో వాడికి పది పైసలు కూడా పడలేదు. ఇంతలోనే రైలు జీవం పోసుకుని పెద్దగా అరిచింది. నిండు గర్భిణిలా కదిలిన రైలు ఇంజను వెనుక ముక్కుతూ, మూలుగుతూ బోగీలు కదిలాయి. రైలు కాస్త వేగం పుంజుకుని, స్టేషన్ని దాటబోతున్న సమయానికి వాడు అతి లాఘవంగా బోగీలో నుంచి ప్లాట్‌ఫారం మీదికి లంఘించాడు.

*** *** ***

అప్పటికే టైమ్ మధ్యాహ్నం రెండు గంటలు దాటుతోంది. పొద్దటి నుంచీ ఖాళీ కడుపుతో వున్నాడేమో నకనకలాడుతున్న పొట్టపై చెయ్యేసి నిమురుకుంటూ, మరో చేత్తో నిక్కరు జేబులను తడుముకున్నాడు. చిల్లులు పడ్డ ఆ జేబుల్లో ఏమీ లేదని, వుండదని కూడా వాడికి తెలుసు. కానీ ఏదైనా వుంటుందనే ఆశ వాడిలో చావలేదు. జేబుల్లో ఏమీ లేకపోవటం, పొద్దున లేచిన దగ్గర్నుంచీ పైసా రాకపోవడంతో కడుపు మండిస్తున్న ఆకలిని చల్లార్చుకోవడానికి నీళ్ళు తాగాలనుకున్నాడు. ఆ స్టేషన్లో నాలుగైదు చోట్ల ప్రయాణీకుల కోసం కొళాయిలను ఏర్పాటు చేశారు. ఆ కొళాయిలను బాగా ఎత్తుగా వుండేలా అమర్చారు. వాడేమో బాగా పొట్టి. అందుకే వాడు కొళాయిలను అందుకోవడం కష్టం. ఇక వాటి కింద దోసిలి పట్టి నీళ్ళు తాగడం మరీ కష్టం. అయితే ఈ సమస్యకు వాడే ఒక పరిష్కారం పెట్టుకున్నాడు. ఆ స్టేషన్లో కాస్త దూరాన వున్న నాపరాయినొకదాన్ని దొర్లించుకుని వచ్చి పెట్టాడు. ఆ రాయిపై ఎక్కి నిలబడితే వాడికి నీళ్ళందుతాయి. అయినప్పటికీ దోసిలితో పట్టుకుని, వాటిని గొంతులోకి వేసుకోబోయాడు.

అంతలోనే...

"రేయ్..మళ్ళీ వచ్చేసినావురా నువ్వు?..లం...కొడకా, ఎన్నిసార్లు చెప్పాల్రా నీకు స్టేషన్లోకి రావొద్దని!.." అంటూ భయంకరంగా అరుస్తూ లాఠీ ఝుళిపిస్తున్న కానిస్టేబుల్ కన్పించాడు వాడికి. అతని చేతికి చిక్కితే ఏమౌతుందో చిట్లిపోయిన వాడి వీపుకు బాగా తెలుసు. అందుకే నీళ్ళ గ్లాసు వదిలేసి దాహం సంగతి మర్చిపోయి, భయంతో చిగురుటాకులా కంపిస్తూ అక్కడి నుంచి పరుగు లంకించుకున్నాడు వాడు. వాడి వెనుకే పరుగు లాంటి నడకతో కొద్ది దూరం వెళ్ళిన కానిస్టేబుల్ వాడిని రైల్వే స్టేషన్ బయటికి తరిమేసి విజయ గర్వంతో వెనక్కొస్తూ. తన వంక నవ్వుతాలుగా చూసిన ఒకళ్ళిద్దరికి విన్పించేలా "ఏమనుకున్నాడో! లం..కొడుకు..' మన దగ్గరే వేషాలేస్తున్నాడు.. వేషాలు.. ఈసారి కన్పిస్తే కాళ్ళిరగ్గొడతా" అని అరుస్తూ క్యాంటీన్ వద్ద తిష్ట వేశాడు.

*** *** ***

రైల్వేస్టేషన్ నుంచి బయటికి వచ్చేసిన వాడు అక్కడి నుంచి ఇంకెక్కడికి వెళ్ళాలో తెలీని వాడిలా అక్కడనే తచ్చాడుతూ వుండిపోయాడు. అయినా ఇది వాడికి రోజూ జరిగేదే. కొత్తేమీ కాదు.

"అమ్మంటే ఏమిటో, నాన్నంటే ఎలా వుంటాడో, తోబుట్టువుల అభిమానం ఎలా వుంటుందో ఏమాత్రం తెలీని వాడికి సర్వం రైల్వే స్టేషనే. పరువు నిలువుకోవడానికో, బరువు దింపుకోవడానికో వాడ్ని ఏ మహాతల్లో రైల్లో వదిలేసి వెడితే, ఏడ్చి, ఏడ్చి గొంతెండిపోయి, అప్పుడో, ఇప్పుడో చచ్చిపోయే స్థితిలో పసిగుడ్డుగా వున్నవాడిని ఆ స్టేషన్లో వుండే ఒక ముసలి బిచ్చగత్తె తన. పొత్తిళ్ళలోకి



తీసుకుంది. ఇంకా కళ్ళు తెరవని పసిగుడ్డుగా వున్నప్పుడే వాడు 'భిక్షక పాత్ర'గా మారిపోయాడు. ఆడిని పెంచడానికి తీసుకున్న ముసల్ది వాడిని వేలపై పడుకోబెట్టి వచ్చీ పోయే ప్రయాణీకులకు వాడి అమాయకమైన ముఖం చూపించి దయ చూపమని ప్రార్థించేది. పాపం.. పసి గుడ్డు..

ఏ పాలకోసమో ఉపయోగపడతాయని ప్యాసింజర్లు తమకు తోచిందేదో విసిరివేసేవారు.

తనకు ఆసరాగా మారిన వాడికి ఆ ముసల్ది పేరేమీ పెట్టలేదు. కానీ నడక నేర్చిన నాటి నుంచే నలుగురి ముందు నిలబడి చేయి చాపటం నేర్పింది. వాడి అడుగులింకా తడబడుతుండగానే వాడిని వదిలేసి తరలిరాని తీరాలకు వెళ్ళిపోయింది.

వాడికి మాటలు వస్తాయో, రావో కూడా ఎవరికీ తెలియదు. ఎందుకంటే 'అయ్యా..' 'అమ్మా!' అనే రెండు మాటలు తప్ప మళ్ళీ పెదాలు కదపడం ఎవరూ చూడలేదు.

అడుక్కొని తెచ్చిన చిల్లరను హోటల్ కౌంటర్లో పెడితే, వాడు అడక్కుండానే ఆ చిల్లరతో ఇవ్వద గిందేదో ఇచ్చేస్తారు. వాళ్ళిచ్చిందేదో తిన్నాననిపించి, రైల్వే స్టేషన్లోనే ఏదో ఒకమూల ఎవరికీ కన్పిం

చకుండా ముడుచుకుని పడుకుంటాడు. కటిక నేలమీదే కునుకుతీసే వాడి శరీరం ఎండా, వాన, చలి అనే భేదాలను గుర్తించనంతగా మొద్దుబారి పోయింది.

*** *** ***

బయట తచ్చాడుతున్న వాడు పచార్లు ముగించి స్టేషన్ ఎంట్రన్స్ గేట్‌లోకి వచ్చి మెల్లగా లోనికి తొంగిచూశాడు. ప్లాట్ పారమ్ మీదికి దృష్టి సారించాడు. అయితే ఎక్కడా కానిస్టేబుల్ జాడ కన్పించకపోవడం, అతను వెంటనే రాలేడనే ధైర్యంతో మళ్ళీ లోపలికి అడుగుపెట్టి, ప్లాట్‌పారం మీదికి వచ్చాడు. ఎవరి హడావిడిలో వాళ్ళుండిపోయిన ప్రయాణీకులు ఎవ్వరూ ఈ దోబూచులాట చూడ్డం లేదు. అది మరీ పెద్ద స్టేషన్ కాకపోవడం వల్ల రైళ్ళ రద్దీ కూడా లేదు. వాడు ప్లాట్ పారమ్ మీద పరిశీలనగా చూశాడు. అక్కడ ఒక తల్లి తన చంటి బిడ్డను చంకనేసుకుని ఇడ్లీలను తినిపించాలని చూస్తోంది. వాడు తిననని మారాం చేస్తుంటే తిన మంటూ బుజ్జగిస్తోందామె. అది చూడగానే వాడి కళ్ళు మెరిశాయి. మరో ఆలోచనేదీ లేకుండానే నేరుగా ఆ తల్లీ బిడ్డలున్న చోటికి వెళ్ళి చేయి చాస్తూ,

"అమ్మా..." అన్నాడు.

"లేదు పోరా.." అతని అభ్యర్థనకు బదులుగా ఛీత్కరించిందామె.

అయితే అప్పటికే ఆకలి నిండిన వాడి శరీరం అక్కడి నుంచి కదలడానికి మొరాయించింది. అలాగని మరోసారి అర్థించే ఓపిక కూడా లేక పోయింది. అందుకే ఆమె చేతిలోని పొట్లం వైపే చూస్తూ చేయి చాచి అలాగే నిలబడ్డాడు.

వాడి ఆకలి చూపులు భరించలేక ఒకటి, రెండు సార్లు అదిలించిందామె. అయినా వాడు కదల్లేదు. దాంతో ఆమెకు కోపమొచ్చి–

'ఈ వెధవ తినడు, ఈ దరిద్రుడు వదలడు" తన బిడ్డనూ, వాడినీ కలిపి తిడుతూ ఆవేశంగా తన చేతిలోని పొట్లాన్ని ఇడ్లీలతో సహా వుండ చుట్టి ప్లాట్‌ఫారం మీది నుంచి రైలు పట్టాల అవతలకి గిరాటేసింది.

దాంతో నిస్తేజమైన వాడి కళ్ళల్లో క్షణకాలం బాధ తొంగి చూసింది. ఆ భావన కొద్దిసేపే. మరుక్షణంలో వాడు ఆ విసిరేసిన పొట్లాన్ని అందుకోవడానికి సిద్ధమయ్యాడు.

*** *** ***

ఎత్తుగా వున్న ప్లాట్‌ఫారమ్ మీది నుంచి కిందికి దుమికాడు వాడు. ఆ పొట్లం రెండవ లైను పట్టాలకి అవతలపడి వుండగా దాన్ని అందుకోవాలనే ఆ వైపుకు అడుగులు వేశాడో, లేదో , అటు వైపు నుంచి వేగంగా వస్తున్న 'రాజధాని' ఎక్స్‌ప్రెస్ కన్పించింది. కళ్ళు మూసి తెరిచే లోగా రైలు సమీపానికి వచ్చేస్తుండడం, వాడు పట్టాల పైకి వెళ్ళడంతో స్టేషన్లో వున్న ప్యాసింజర్లందరి దృష్టి వాడిమీద పడింది. వెంటనే ఎవరో–

'రేయ్..పైకి రారా.. లేకపోతే చచ్చిపోతావ్‌రా వెధవా.." అని గట్టిగా అరిచి హెచ్చరించారు.

అయితే చావనే మాటకు అర్థం కూడా తెలియని వాడిలా 'వాడు' మొదటి ట్రాక్ దాటి, రెండవ ట్రాక్ మీదికి వెళ్ళిపోయాడు. పొట్లానికీ వాడికీ మధ్య ఐదారడుగుల దూరం వుండగానే రాజధాని ఎక్స్‌ప్రెస్ మృత్యువులా ముంచుకోస్తోంది. దాంతో జరిగే ఘోరం చూడలేమన్నట్టు కొందరు బలహీన మనస్కులు కళ్ళు మూసుకుంటే, ఇంకొందరు గట్టిగా అరిచేశారు.

*** *** ***

అందరూ వాడు చచ్చిపోయాడనే అనుకున్నారు. అయితే వాడు బతికే వున్నాడని రైలు దాటిపోయాక గానీ అర్థం కాలేదు.

రైలు మొదటి ట్రాక్ మీదుగా వెళ్ళింది.

వాడు రెండవ ట్రాక్ పై నిలబడి వున్నాడు.

"అదృష్టవంతుడు చావు తప్పించుకున్నాడు.." అన్నారెవరో.

మిగిలిన వారు దానికి వంత పాడుతూ వాడు బతికినందుకు సంతోషించారు.

అయితే రైలు వేగంతో పాటే సుళ్ళు తిరుగుతూ వచ్చిన సుడిగాలిలో ఎగిరిపోయిందో, చక్రాలతో పాటే వెళ్ళిపోయిందో తెలీదు గానీ ఇడ్లీల పొట్లం అదృశ్యమైపోయింది. దాంతో ఆకలి కాస్తా ఆక్రోశంగా మారడంతో, బాల్యాన్నీ ఎవ్వడో మర్చిపోయినవాడు ఇవ్వడా విషయం గుర్తొచ్చినవాడిలా ఏడుస్తున్నాడు. వెక్కిళ్ళు పెడుతున్నాడు. తాను బతికున్నందుకు లోకం సంతోషిస్తుంటే..

బతకాల్సివస్తున్నందుకు వాడేడుస్తున్నాడు.

## కలిసిపోయిన షారూక్, సునీల్

ఇంతవరకూ పత్రికల్లో ఒకరినొకరు తిట్టుకున్న షారుక్ ఖాన్, సునీల్‌శెట్టి ఇటీవల తమ తమ ఫ్యామిలీతో కలిసి ఒకే విమానంలో ఢిల్లీ వెళ్తూ ఒకరికొకరు సారీ చెప్పుకోవడంతో వారి మధ్య గొడవలన్నీ పోయి కలిసిపోయారు. పైగా నేనెప్పుడూ సునీల్‌శెట్టిని గురించి పత్రికల్లో విమర్శించలేదని షారూక్ అంటుంటే, తనను గురించి చెడ్డగా ప్రచారం చేసాడనుకొని షారూక్‌ని అపార్థం చేసుకున్నానని సునీల్‌శెట్టి అంటున్నాడు.



## అక్కడే నయం అంటున్న నాగార్జున

ఈమధ్య ప్రతి సినిమాలోను ఒకటో రెండో పాటల్ని విదేశాల్లో చిత్రీకరించడం మామూలైపోయింది. ఇదే విషయాన్ని నిర్మాత, హీరో అయిన నాగార్జున చెప్తూ మనవాళ్లు విదేశంలో కరెక్టుగా టైముకి వచ్చి చెప్పినట్లు చేస్తారనీ, ఇక్కడికి వచ్చేసరికి మళ్లీ బద్ధకిస్తారనీ అంటూ, లొకేషన్లో షూటింగ్ పర్మిషన్ల కోసం అందరి చుట్టూ తిరగాల్సిన పనికూడా తప్పుతుందనీ అందుకని విదేశాల్లో షూటింగ్ ఎంతో నయం అని చెప్తున్నాడు.

